# నమస్తే తెలంగాణ
## యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 30 జూలై 2024 | YADADRI BHUVANAGIRI


## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ, జూలై 29: సీఎం సహాయ నిధి ఆపదలో ఉన్న పేదలకు వరమని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 112 మంది నిరుపేదలకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 36,26,500 విలువ గల చెక్కులను సోమవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో గుత్తా సుఖేందర్‌రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి ద్వారా లక్షలాది మంది పేదలకు సాయం అందుతున్నద తెలిపారు.

# అసెంబ్లీలో జగదీశ్‌రెడ్డి చెడుగుడు

- సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రి కోమటిరెడ్డికి స్ట్రాంగ్ కౌంటర్
- ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన మాజీ మంత్రి గుంటకండ్ల ప్రసంగం


అసెంబ్లీలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, జూలై 29 (నమస్తే తెలంగాణ) : శాసనసభా సమావేశాల వేదికగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని చెడుగుడు ఆడారు. నిత్యం ఏదోక సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో ఉండాలనుకోవడం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పరిపాటే. ఈ క్రమంలోనే ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి మెప్పు కోసం బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ మీద అసందర్భ వ్యాఖ్యలు చేస్తూ వస్తున్నారు. సోమవారం ఇదే తరహాలో అసెంబ్లీ వేదికగా సబ్జెక్టుకు సంబంధం లేకుండా వ్యక్తిగత ఆరోపణలకు దిగారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని ఉద్దేశిస్తూ మర్డర్ కేసులు, క్రిమినల్ కేసులు అంటూ ఏదోదే మాట్లాడబోయారు. ఇవే విషయాలు గత పదేండ్లుగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెబుతూనే వస్తున్నారు. మళ్లీ ఎప్పటివో పాత విషయాలను ప్రస్తావించబోగా జగదీశ్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఎదురుదాడికి దిగుతూ సవాళ్లు విసిరారు. ప్రస్తుతం తన మీద ఒక్క కేసు ఉన్నట్లు నిరూపించినా అసెంబ్లీలో ముక్కు నేలకు రాసి పదవికి రాజీనామా చేస్తానని తేల్చి చెప్పారు. నిరూపించకపోతే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తమ సీట్ల నుంచి స్పీకర్ పోడియం వరకు ముక్కు నేలకు రాసేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. ఇదే సమయంలో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపైనా జగదీశ్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్‌తో ఎదురుదాడికి దిగడం సభలో హైలెట్‌గా నిలిచింది. తమ అధినేత కేసీఆర్ సత్యహరిచంద్రుడేనంటూ రేవంత్ మాదిరిగా సంచులు మోసి జైలుకు వెళ్లిన చంద్రుడు కాదని సెటైర్ వేశారు. 'చర్లపల్లి జైలు జీవితం రేవంత్‌కు అనుభవం కాబట్టే ఆయన మళ్లీ దాన్ని గుర్తు చేసుకుంటున్నారు. నేను జైలు జీవితం గడిపా. తెలంగాణ ఉద్యమంలో పోరాటం చేసి చంచల్‌గూడ జైలుకు వెళ్లాను. కానీ సీఎం రేవంత్‌రెడ్డికి చర్లపల్లి జైలు జీవితమే గుర్తు ఉంటుంది' అని తీవ్రంగా స్పందించారు. తాము మాట్లాడిన ప్రతి మాటనూ అసెంబ్లీ నుంచి ప్రజలకు చూపించాలని స్పీకర్‌ను కోరారు. 'నాపై మూడు హత్య కేసులు ఆనాటి కాంగ్రెస్ ఎమ్మెల్యే పెట్టారు. ఆ మూడింటిలో కోర్టు నన్ను నిర్దోషిగా తేల్చింది. ఇవి కాకుండా ఏమైనా ఉంటే హౌస్ కమిటీ వేసి విచారణ జరపాలి. మంత్రి కోమటిరెడ్డి చెప్పిన రెండు కేసుల్లో ఒక్కటి ఉన్నా ముక్కుకు నేలకు రాసి రాజీనామా చేస్తా'నని స్పష్టం చేశారు. తమపై సీఎం, మంత్రులు చేసే విమర్శలను ప్రజలకు చూపినట్లే తమ మాటలను కూడా ప్రజలకు చూపించాలని స్పీకర్‌ను కోరారు. సీఎం సభలోకి వచ్చాకే సబ్జెక్ట్ డీవియేషన్ అయ్యింది తప్ప తనతో కాదని జగదీశ్‌రెడ్డి చెప్పుకొచ్చారు. కేసీఆర్ గురించి మాట్లాడే కాంగ్రెస్ నేతలు ఆయన కాలి గోటికి సరిపోతారా అధ్యక్షా అంటూ కౌంటర్ల మీద కౌంటర్లు వేసి ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేశారు. అవన్నీ సోమవారం సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా వైరల్ అయ్యాయి.

# వడివడిగా కృష్ణమ్మ

## శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు 3 ఓపెన్

- నాగార్జునసాగర్ వైపు తరలివస్తున్న కృష్ణమ్మ
- శ్రీశైలం నుంచి 1.62లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 512.60 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం
- ఆనందంలో ఆయకట్టు రైతాంగం

నల్లగొండ ప్రతినిధి, జూలై 29 (నమస్తే తెలంగాణ)/నందికొండ : ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణమ్మ వడివడిగా పరుగులు తీస్తున్నది. శ్రీశైలం ప్రాజెక్టును భారీ వరద ముంచెత్తుతుండడంతో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు 3 క్రస్ట్ గేట్లు తెరుచుకున్నాయి. ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి ద్వారా వస్తున్న నీటితో కలిపి మొత్తం 1.62లక్షల క్యూసెక్కుల నీరు సాగర్‌కు చేరుకుంటున్నది. నాగార్జునసాగర్ జలాశయంలో వారం రోజుల్లో 9 అడుగుల నీటి మట్టం పెరిగి సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి 512.60 అడుగులకు చేరుకుంది. శ్రీశైలం గేట్ల నుంచి విడుదలైన వరద నీరు కూడా మంగళవారం ఉదయానికి సాగర్‌ను తాకవచ్చని అంచనా. కృష్ణానది ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో భారీగా వరద ప్రవహిస్తున్నది. ఇలాగే వారం రోజులు కొనసాగితే నాగార్జునసాగర్ జలాశయం నిండుతుంది. ప్రస్తుత పరిస్థితులతో సాగర్ ఆయకట్టు రైతాంగం సంతోషం వ్యక్తం చేస్తున్నది.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రధాన భూభాగానికి సాగు నీరందించే నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిండే సూచనలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ఈ సీజన్‌లో అనుకున్న దానికంటే ముందే భారీ వరదలు కృష్ణానదిలో పోటెత్తుతుండడంతో ఆశాజనక పరిస్థితులు నెలకొన్నాయి. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ నిండడంతో కృష్ణమ్మ జూరాల క్రస్ట్ గేట్ల మీదుగా శ్రీశైలం ప్రాజెక్టుకు ప్రవహిస్తున్నది. సోమవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి ఎగువ నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు 4,52,583 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. శ్రీశైలంలో పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా 879.20 అడుగులకు చేరుకుంది. దాంతో శ్రీశైలం డ్యామ్ క్రస్ట్ గేట్లు మూడింటిని 10 అడుగుల మేర ఎత్తి 81వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా వచ్చే నీటితో కలిపి మొత్తం 1,62,466 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్ వైపు పరుగులు పెడుతున్నది. మూడు రోజులుగా వరద ఉధృతి కొనసాగుతుండడంతో శ్రీశైలంలో వేగంగా నీటి మట్టం పెరుగుతూ వచ్చింది. ఆదివారం సాయంత్రం ఆరు గంటల నుంచి సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు 24 గంటల్లోనే 28 టీఎంసీల నీరు శ్రీశైలానికి వచ్చి చేరింది. ప్రస్తుతం శ్రీశైలంలో 215.80 టీఎంసీల పూర్తి స్థాయి నీటి సామర్థ్యానికి గానూ 184.28 టీఎంసీల నీరు ఉంది. ఎగువ నుంచి వరద నాలుగున్నర లక్షల క్యూసెక్కుల వరకు ఉండడంతో పూర్తి స్థాయి నీటి మట్టానికి మరో ఆరడుగులు ఉండగానే క్రస్ట్ గేట్లను ఎత్తారు. దాంతో ఇక ఆ వరద నీరంతా దిగువన ఉన్న నాగార్జునసాగర్ ప్రాజెక్టుకే చేరనుంది.


నాగార్జునసాగర్ జలాశయం

### సాగర్‌లో 9 అడుగులు పెరిగిన నీటిమట్టం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పూర్వం సాగర్‌కు నీరు రావాలంటే శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిగా నిండి గేట్లు ఎత్తితేనే విడుదల అయ్యేవి. స్వరాష్ట్రంలో కేసీఆర్ సర్కార్ కృష్ణానీటి వాటా విషయంలో నిక్కచ్చిగా వ్యవహరిస్తూ ముందస్తు ప్రణాళికను అనుసరించింది. అదే ఆనవాయితీని ప్రస్తుతం కొనసాగించక తప్ప లేదు. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద మొదలైన నాటి నుంచే విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. దాంతో ఇప్పటి వరకు విద్యుత్ ఉత్పత్తి ద్వారా వచ్చి చేరిన వరద నీటితో నాగార్జున సాగర్‌లో వారం రోజుల్లో 9 అడుగుల మేర నీటి మట్టం పెరిగింది. సోమవారం సాయంత్రానికి సాగర్ నీటి మట్టం 512.60 అడుగులకు చేరగా 54,772 క్యూసెక్కుల నీరు విద్యుత్ ఉత్పత్తి ద్వారా ఇన్‌ఫ్లోగా వస్తున్నది. సాగర్ జలాశయం పూర్తిస్థాయి సామర్థ్యం 312 టీఎంసీలు కాగా, నీటి నిల్వ 136.13 టీఎంసీలకు పెరిగింది. శ్రీశైలం క్రస్ట్‌గేట్ల నుంచి వచ్చే నీటితో కలుపుకొని ఇన్‌ఫ్లో 1,62,466 క్యూసెక్కులు ఉండగా, మంగళవారం ఉదయానికి అది సాగర్‌ను తాకనున్నది. దాంతో సాగర్‌లోనూ వేగంగా నీటిమట్టం పెరగనుంది. ఎగువ నుంచి వరద భారీగా ఉండడంతో త్వరలోనే సాగర్‌కు కూడా జలకళ సంతరించుకునే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ముందుగానే మొదలైన వరద అక్టోబర్ వరకు కొనసాగే అవకాశాలున్నాయి. దాంతో ఈసారి కూడా నాగార్జునసాగర్‌తోపాటు ఏఎమ్మార్పీ, వరద కాల్వ ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందవచ్చన్న అంచనాలు పెరుగుతున్నాయి. దాంతో రైతులు కూడా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గతేడాది సాగర్ నిండకపోవడంతో ఆయకట్టులో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే.

### పెరుగుతున్న మూసీ నీటిమట్టం


నీటితో కళకళలాడుతున్న మూసీ రిజర్వాయర్

కేతేపల్లి, జూలై 29 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో అతిపెద్ద సాగునీటి వనరు అయిన మూసీ ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. సోమవారం 636.79 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అధికారులు అంతే మొత్తంలో దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645(4.46 టీఎంసీలు)అడుగులు కాగా, ప్రస్తుతం 642.50 (3.82 టీఎంసీలు) అడుగుల మేర నీరు ఉంది.

### కృష్ణా పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి

నీలగిరి, జూలై 29 : శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తిన నేపథ్యంలో జిల్లాలోని కృష్ణా నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. ఈత కోసమని, బట్టలు ఉతికేందుకని నదిలోకి తీసుకువెళ్లొద్దని, నది దాటే ప్రయత్నం చేయొద్దని హెచ్చరించారు. కృష్ణా పరివాహక మండలాల అధికారులు ముందు జాగ్రత్త చర్యగా ప్రజలను అప్రమత్తం చేసి.. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.


శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న తెలంగాణ పారంపర్య వైద్య మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాత్రి మహారుషి

# ఆయుర్వేద వైద్యులపై దాడులను ఆపాలి

- తెలంగాణ పారంపర్య వైద్య మహా సంఘం డిమాండ్
- యాదగిరిగుట్టలో శిక్షణ శిబిరం

యాదగిరిగుట్ట, జూలై 29 : ఆయుర్వేద డాక్టర్లను గుర్తించి, వారిపై వైద్యారోగ్య శాఖ చేస్తున్న దాడులను నిలిపివేయాలని తెలంగాణ పారంపర్య వైద్య మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాత్రి మహారుషి డిమాండ్ చేశారు. సోమవారం యాదగిరిగుట్ట పట్టణంలో ఆ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరాన్ని పల్లె సృజన సంస్థ అధినేత పోగుల గణేశ్, ఆయుర్వేద విశ్రాంత అధికారి జకోటియాతో కలిసి ప్రారంభించారు. రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా పెద్ద సంఖ్యలో ఆయుర్వేద వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాత్రి మహారుషి మాట్లాడుతూ పూర్వం నుంచి ఆయుర్వేద వైద్యులు అనేక ప్రాంతాల్లో మానవతా విలువలతో వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. అరుదైన వన మూలికలతో వైద్యం చేస్తూ సమాజహితానికి పాల్పడుతున్నారని తెలిపారు. పోగుల గణేశ్, జకోటియా మాట్లాడుతూ ఆయుర్వేద డాక్టర్లు జీవ వైవిధ్యాన్ని కాపాడే ఔషధ మొక్కలను పెంచుతూ, వాటిని వినియోగించి సంప్రదాయ వైద్యం చేస్తున్నారని పేర్కొన్నారు. శిబిరంలో 350కి పైగా ఔషధ మొక్కలు, వన మూలికలను ప్రదర్శించారు. వాటి ఔషధ విలువలను వివరించారు. అంతరించిపోతున్న అరుదైన వన మూలికలను పరిరక్షించాలని 105 మొక్కలతో కూడిన ఫ్లెక్సీని ప్రదర్శించారు. వెయ్యికిపైగా మొక్కలతో ఒక ఆల్బమ్‌ను రూపొందించి మొక్కలు గుర్తింపు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు సింహాచలం లక్ష్మణ్‌స్వామి తెలిపారు.

# పెరిగిన 'ఉపాధి'

## మూడు నెలల్లో 3.81లక్షల పని దినాల పెంపు

- జిల్లాలో 131శాతం పని దినాలు పూర్తి
- రోజు కూలి రూ.229
- మొత్తం 1,41,351 జాబ్ కార్డులు



యాదాద్రి భువనగిరి, జూలై 29 (నమస్తే తెలంగాణ) : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో జిల్లాలో పని దినాలు పెరిగాయి. మూడు నెలల్లో సుమారు నాలుగు లక్షల పని దినాలు అధికంగా కల్పించారు. జిల్లాలో నిర్దేశించుకున్న లక్ష్యంలో ఇప్పటి వరకు 131శాతం పని దినాలు పూర్తయ్యాయి. ఉపాధి కూలి కూడా అధికంగా చెల్లించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వంద శాతం పని దినాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు చెప్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి ఉపాధి కల్పించేందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చారు. రైతులు, కూలీలకు ఆర్థిక సహకారం అందించేందుకు ఇది తోడ్పడుతున్నది. జిల్లాలో 1,41,351 జాబ్ కార్డులు ఉండగా, 2024-25 సంవత్సరానికి 32,57,979 పని దినాలకు లేబర్ బడ్జెట్ తయారు చేశారు. పనులను గుర్తించి గ్రామసభల ఆమోదం పొందడం జరిగింది. జిల్లాలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో గతేడాదితో పోలిస్తే ఈసారి 3,81,746 పని దినాలు పెరిగాయి. గతేడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మొత్తం 17,12,726 పని దినాలు కాగా, ఈ ఏడాది 20,94,472 పని దినాలు కల్పించారు. మొత్తంగా 131 శాతం పని దినాలు పూర్తయ్యాయి. రాజాపేట మండలం మినహా అన్ని చోట్ల మంచి ఫలితాలు వచ్చాయి. తుర్కపల్లిలో 41,461, బీబీనగర్‌లో 41450, ఆత్మకూర్ (ఎం)లో 40,562, బొమ్మలరామారంలో 34,719 పని దినాలు పెరిగాయి. కూలి కూడా వీలైన ఎక్కువగా ఇచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. వేజ్ రేట్ రూ.300 కాగా, ప్రస్తుతం 229 చెల్లిస్తున్నారు. కూలీల వివరాలను పని ప్రదేశంలోనే ఫీల్డ్ అసిస్టెంట్ ఫోన్‌లో నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్ ద్వారా నమోదు చేస్తున్నారు.

### వంద శాతం ఉపాధి లక్ష్యం



జాబ్ కార్డులు ఉన్నవాళ్ల ఉపాధి హామీ పని కల్పిస్తాం. ప్రణాళిక ప్రకారం గ్రామాల్లో పనులు చేపడుతున్నాం. మూడు నెలల్లోనే సుమారు 4 లక్షల పని దినాలు అధికంగా కల్పించాం. ఇప్పటికే 131 శాతానికి చేరుకున్నాం. పర్యవేక్షణ, ఫోకస్‌తోనే ఇది సాధ్యమైంది. వంద శాతం ఉపాధి పని దినా లు కల్పించడమే లక్ష్యం. కూలి కూడా పెంచాం.

– కృష్ణన్, డీఆర్‌డీఓ

# 16,143 మందికి రెండో విడుత రుణమాఫీ

- నేటి నుంచి బ్యాంకు ఖాతాల్లో జమ
- రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు..
- తొలి విడుతలో 437 మందివి పెండింగ్

యాదాద్రి భువనగిరి, జూలై 29 (నమస్తే తెలంగాణ) : రెండో విడుత రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. లక్ష నుంచి లక్షన్నర మధ్య లోన్ ఉన్న రైతుల ఖాతాల్లో మంగళవారం నుంచి నగదు జమ కానుంది. అందుకు సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో రెండో విడుతలో భాగంగా 16,143 మంది రైతులకు రూ.165.87 కోట్లు మాఫీ కానుంది. చౌటుప్పల్ మండలంలో అత్యధికంగా 1,693 మంది లబ్ధిదారులు ఉన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో రుణమాఫీ ప్రత్యేక సమావేశం నిర్వహించనుండగా, కలెక్టర్‌తోపాటు వ్యవసాయ శాఖ, సహకార శాఖ అధికారులు, కొందరు లబ్ధిదారులు పాల్గొంటారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని విన్న అనంతరం కలెక్టర్ రెండో విడుత రుణమాఫీ సంబరాలను రైతుల సమక్షంలో నిర్వహించనున్నారు. కాగా, తొలి విడుతలో జిల్లా 36,483 మంది రైతులను గుర్తించగా, ఇంకా 437 మందికి రుణమాఫీ జరుగలేదు. బ్యాంకు అకౌంట్ క్లోజ్ చేయడం, కొన్ని పత్రాలు జత చేయకపోవడం వంటి కారణాలతో వారి ఖాతాలో నగదు జమ కాలేదని కూడా వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారు.



### రెండో విడుత రుణమాఫీ ఇలా..

| మండలం | రైతులు | అమౌంట్ |
|---|---|---|
| అడ్డగూడూరు | 266 | 2,87,82,461 |
| ఆలేరు | 709 | 7,22,12,503 |
| ఆత్మకూర్ (ఎం) | 453 | 4,62,11,885 |
| భువనగిరి | 935 | 9,63,69,120 |
| బీబీనగర్ | 617 | 6,20,22,209 |
| బొమ్మలరామారం: | 775 | 7,64,51,724 |
| చౌటుప్పల్ | 1693 | 17,72,65,305 |
| గుండాల | 930 | 9,58,56,759 |
| మోటకొండూర్ | 913 | 8,29,50,041 |
| మోత్కూర్ | 1142 | 1,22,93,0015 |
| నారాయణపురం | 999 | 10,13,89,622 |
| పోచంపల్లి | 900 | 9,87,65,768 |
| రాజాపేట | 843 | 8,93,74,674 |
| రామన్నపేట | 1224 | 12,39,17,732 |
| తుర్కపల్లి | 1058 | 11,38,40,792 |
| వలిగొండ | 1675 | 16,97,62,050 |
| యాదగిరిగుట్ట | 676 | 6,67,76,238 |
| ఇతరులు | 335 | 3,38,50,613 |
| మొత్తం | 16,143 | 165,87,29,511 |

## మరో 106 మంది టీచర్లకు పదోన్నతులు

- సీనియారిటీ ప్రకారం ఉత్తర్వులు

రామగిరి, జూలై 29 : ఉపాధ్యాయ పదోన్నతుల్లో భాగంగా నల్లగొండ జిల్లాలో మరో 109 మంది టీచర్లకు అవకాశం దక్కింది. జిల్లా వ్యాప్తంగా కొంత మంది టీచర్లకు రెండు, మూడు పోస్టుల్లో పదోన్నతులు వచ్చిన విషయం విదితమే. అలా వచ్చిన వారు ఏదో ఒకదానిలో మాత్రమే చేరారు. ఇలా మిగిలిన వాటిని భర్తీ చేయాలని సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో కేటగిరీ వారీగా మిగిలిన పోస్టులకు సీనియారిటీ జాబితాను సిద్ధం చేయగా పదోన్నతులు పొందిన వారి వివరాలను ఆదివారం రాత్రి విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. జిల్లాలో 109 పోస్టులు ఖాళీగా ఉండగా 106 భర్తీ అయ్యాయని, ఇంకా మూడు పోస్టులు మిగిలినట్లు డీఈఓ భిక్షపతి సోమవారం తెలిపారు. అందరికీ పదోన్నతుల పోస్టింగ్ ఉత్తర్వులు అందజేశామని, వారంతా ఆయా పాఠశాలల్లో రిపోర్టు చేయాలని చెప్పారు.

### ఎస్‌ఐల బదిలీ

నీలగిరి, జూలై 29 : నల్లగొండ జిల్లాలో పని చేస్తున్న నలుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ శరత్ చంద్ర పవార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌కు చిట్యాల ఎస్‌ఐ సైదాబాబును, తిరుమలగిరి(సాగర్)కు మిర్యాలగూడ వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనుకుమార్‌ను బదిలీ చేశారు. నల్లగొండ రూరల్ ఎస్‌ఐ శివకుమార్, తిరుమలగిరి ఎస్‌ఐ నారాయణరెడ్డిని వీఆర్‌కు అటాచ్ చేశారు.

## దివ్యాంగులకు రూ. 6వేలు పింఛన్ ఇవ్వాలి

- వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ ప్రతులను తగులబెట్టి నిరసన తెలుపుతున్న గిద్దె రాజేశ్, దివ్యాంగులు

ఆత్మకూర్.ఎస్, జూలై 29 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కందగట్లలో సోమవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ దివ్యాంగులకు నిరాశను మిగిల్చిందన్నారు. అధికారంలకి వస్తే దివ్యాంగుల పింఛన్ రూ. 6వేలు పెంచుతామని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రస్తుత బడ్జెట్‌లో ఆ ప్రస్తావన లేకపోవడం దురదృష్టకరమని తెలిపారు. దివ్యాంగుల పరికరాలు, స్వయం ఉపాధి రుణాల కోసం పైసా కూడా కేటాయించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే బడ్జెట్‌ను సవరించి 5శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లూరి ఈదయ్య బాబు, జిల్లా యూత్ నాయకులు గుంట శివకుమార్, గోగుల శేఖర్‌రెడ్డి, మహిళా నాయకురాలు గోగుల పద్మారెడ్డి పాల్గొన్నారు.


